

# 9. శ్రీమాత్రే నమః

కాకి పిల్ల కాకికి ముద్దు అంటారు కానీ 'ఎవరి మాతృమూర్తి వారికి గొప్ప' లాంటి సామెత లేదెందుకో! పిల్లలు ఎలాంటివారైనా ఎంత వయసొచ్చినా తల్లికి వాళ్ళంటే ముద్దే. కానీ పిల్లలకి మాత్రం కాస్త ఎదిగేసరికి తల్లి గొప్పగా కనిపించడం మానేస్తుందేమో! ఆవిడలో లోపాలు కనిపించడం... అసంతృప్తులు మొదలవడం జరుగుతుందేమో!

నాకైతే అదే జరిగింది. మా అమ్మ అంటే చిన్నప్పుడు నాకు ప్రాణంగా వుండేది. స్కూల్ చదువు అయిపోయి కాలేజ్‌లో చేరేవరకూ అమ్మని మించిన వాళ్ళు లేరని అనుకునేదాన్ని.

ప్రతివిషయం పట్లా కచ్చితమైన అభిప్రాయమూ, అవగాహనా.... దానిని చక్కగా మాటల్లో వ్యక్తపరచగల నేర్పూ వున్న అమ్మ అంటే ఇరుగు పొరుగు ఆడవాళ్ళే కాదు మగవాళ్ళు కూడా చాలా గౌరవం చూపేవారు. అందరూ అమ్మ సలహాలు తీసుకోవడం... ఆవిడ చెప్పే విషయాలు శ్రద్ధగా వినడం చూస్తే నాకు గర్వంగా వుండేది.

ఆ తర్వాత.... కాలేజ్‌లో చేరినపుడు నాకు రమ్యతో పరిచయం అయింది. రోజూ నేను వాళ్ళ యింటికి వెళ్ళేదాన్ని. అక్కడి నుంచి యిద్దరం కలిసి కాలేజ్‌కి వెళ్ళేవాళ్ళం.

ఒకరోజు నేను వెళ్ళేసరికి.. రమ్య కాలేజ్‌కి తయారవుతోంది. వాళ్ళ అమ్మ కంచంలో అన్నం కలుపుకుని వచ్చి దాని వెనకాలే తిరుగుతూ నోట్లో ముద్దలు పెడుతోంది.

నాకు చాలా కొత్తగా అనిపించిందా దృశ్యం. అమ్మ ఎపుడూ అలా ముద్దలు కలిపి పెట్టిన గుర్తు లేదు.

ఆరోజు నుంచీ అమ్మని కొత్తగా చూడటం మొదలయింది. అందరు అమ్మలూ

ఎలా వున్నారు!... మా అమ్మ ఎలా వుంది! అని పరిశీలించడం మొదలయింది. రమ్య ఎప్పుడూ వాళ్ళ అమ్మ ఒడిలో పడుకుని గారాబాలు పోవడం... ఆవిడని గట్టిగా కావిలించుకుని ముద్దులు పెట్టుకోవడం... ఆవిడ చేత జడలు వేయించుకోవడం... అన్నీ కొత్తగా... వింతగా... గొప్పగా కనిపించేవి.

అమ్మ అంటే యివన్నీ చేయాలా! మరి అమ్మ నాకు ఒక్కరోజు కూడా యివేవీ చేయలేదేమిటి! అనిపించేది.

అమ్మ నన్నెపుడూ ఒక ఫ్రెండ్‌లా చూసేది. నాతో ఎన్నో విషయాలు చర్చించేది. పుస్తకాలు.. మనుషులు.. సిద్ధాంతాలు.. సంఘటనలు.. యిదీ అదీ అని లేకుండా అన్నిటినీ యిద్దరం కూర్చుని విశ్లేషించేవాళ్ళం.

కానీ.. కానీ.. అవన్నీ అమ్మ చేయాల్సిన పనులు కాదు కదా! అలాంటి చర్చలు నేను ఎవరితోనయినా చేయగలను. ఒక అమ్మ మాత్రమే యివ్వగలిగినవీ... చేయగలిగినవీ అమ్మ నాకు చేసిందా!

కాలేజ్‌లో చేరినపుడు చిన్న విత్తనంలా మనసులో దూరిన ఆ అసంతృప్తి... చదువూ, వుద్యోగం, పెళ్ళీ... యివన్నీ అయ్యేనాటికి వటవృక్షంలా ఎదిగింది.

అమ్మతో నా స్నేహం కొనసాగుతూనే వుంది. ఆవిడ్ని యిష్టపడడమూ... ప్రతి విషయాన్నీ ఆవిడతో చర్చించడమూ జరుగుతూనే వుంది. కానీ ఆవిడ నాకు ఏదో అన్యాయం చేసిందన్న అసహనమూ మరోప్రక్కన పెరుగుతూనే వుంది.

అది అపుడపుడూ బయటపడడం... అమ్మతో వాదనలు జరగడం మొదలయింది.

'నన్ను ఎప్పుడైనా గారాబం చేశావా! ముద్దు చేశావా!' అంటూ సూటిగా పోట్లాడటానికి ఏదో యిబ్బంది అడ్డువచ్చేది. అందుకే అలా ఎపుడూ అడగలేదు నేను.

కానీ... 'నువు పెద్ద గొప్ప అమ్మవేం కాదులే' అన్న అర్థం వచ్చేట్లు డొంకతిరుగుడుగా ఏదో ఒకటి అనేదాన్ని. దాన్ని సహించలేక అమ్మ కూడా ఏదో ఒకటి అనేది. మాటా మాటా పెరిగేది. ఇలా మెల్లగా ఒక అఖాతం ఏర్పడింది మా యిద్దరి మధ్యా.

క్రిందటిసారి వూరికెళ్ళినపుడు అదే జరిగింది. శ్రీధర్‌కీ నాకూ మధ్య జరిగిన చిన్న గొడవేదో చెప్పాను అమ్మకి. నేను చాలా బాధపడుతూ చెప్పిన ఆ విషయాన్ని ఆవిడ చాలా నిర్లిప్తంగా వింది. ఆ తర్వాత.... తన ధోరణిలో తాను ఆ పరిస్థితినంతా విశ్లేషించి ఏదో సలహా యిచ్చింది.

నాకు ఒళ్ళు మండిపోయింది. ఆమాత్రం నాకు తెలీక కాదు. ఆవిషయాన్ని నేను హ్యాండిల్ చేసుకోలేకా కాదు అమ్మతో చెప్పింది.

ఆవిడ నుంచి నేను ఆశించింది సలహాలు కాదు. నన్ను దగ్గరికి తీసుకుని... గుండెల్లో పొదువుకుని.... ఆవు తన దూడని లాలించినట్లు లాలించాలన్న ఆశ ఏదో వుంది నాకు. కానీ ఆవిడ నాకు ఆమడ దూరంలో కూర్చుని, తాపీగా, ఓ కౌన్సిలర్‌లా సలహా చెప్పడంతో చిరాకొచ్చింది. "ఛీ. అసలు నీతో చెప్పడం నాదే బుద్ధి తక్కువ" అంటూ లేచి యివతలికి వచ్చేశాను.

అమ్మకి అసలేమీ అర్థం కాలేదనుకుంటా. తను చెప్పిన సలహా నాకు నచ్చలేదనో, నాకు అహంకారం ఎక్కువైందనో అనుకుని వుంటుంది కానీ... నా అసంతృప్తిని మాత్రం అర్థం చేసుకోలేదు.

ఆవిడ కూడా గంభీరంగానే మొహం పెట్టుకుని నన్ను సాగనంపింది.

మళ్ళీ ఆరునెలలకి యిప్పుడు... అమ్మ 'సీమంతం చేస్తాను రమ్మం'టే వెళ్తున్నాను. పది రోజులు సెలవు పెట్టాను. ముందు శ్రీధర్ వాళ్ళ అన్నయ్య గారింటికి వెళ్ళి, అక్కడ ఓ రోజు వుండి... ఆతర్వాత అందరం కలిసి అమ్మ దగ్గరికి వెళ్ళాలని ప్లాన్.

ట్రైన్ ఎక్కేసరికి సర్‌ప్రైజ్! ఎదురు సీట్లలో రమ్యా, వాళ్ళ ఆయనా! చాలా ఏళ్ళ తర్వాత కలుసుకున్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాం. వాళ్ళ ఆయన్నీ, మా ఆయన్నీ మర్చిపోయి కబుర్లలో పడ్డాం.

అమ్మ దగ్గరికి వెళ్తున్నానని చెప్పగానే "ఎలా అయినా నువ్వు చాలా అదృష్టవంతురాలివే" అంది రమ్య.

"మీ అమ్మగారు నీతో చక్కగా అన్ని విషయాలూ మాట్లాడతారు. సలహాలిస్తారు." అంది గొంతులో దిగులు ధ్వనిస్తుండగా.

అలాంటి ప్రశంసలు వింటే యిదివరకు గర్వంగా అనిపించేది. ఇప్పుడు అవేమాటలకి అసహనం కలుగుతోంది.

"నీకేం తక్కువైందిపుడు! మీ అమ్మకి నువ్వంటే ప్రాణం కదా!" అన్నాను.

"ఆ. ప్రాణమే. ఆ ప్రేమే నాకు ఎదుగూ బొదుగూ లేకుండా చేసింది" అంది రమ్య నిట్టూరుస్తూ.

"అదేమిటి!"

"అవునే, ఇంజినీరింగ్ అయిపోగానే బెంగుళూర్‌లో మంచి జాబ్ వస్తే.. 'అమ్మో! వేరే వూర్లో ఒక్కదానివీ ఎలా వుంటావు!' అని పంపించలేదు. హైదరాబాద్‌లో ఇంటి ప్రక్కనున్న ఇంజినీరింగ్ కాలేజ్‌లో లెక్చరర్‌గా చేరాను. పెళ్ళీ అంతే. మాకళ్ళెదురుగా

వుంటావంటూ ఇక్కడి సంబంధమే చేశారు. నా కజిన్స్ అందరూ అమెరికాలోనే వున్నారు తెలుసా!" గొంతు తగ్గించి చెప్పింది రమ్య.

నేను అప్రయత్నంగా వాళ్ళ ఆయన వైపు చూశాను. ఆయనా, శ్రీధర్ – యిద్దరూ వాళ్ళ కబుర్లలో వాళ్ళున్నారు. మా మాటలు విన్నట్లు లేదు.

నా భావం అర్థమయినట్లు రమ్య నవ్వింది. "ఈ పెళ్ళి గురించి నాకేం అసంతృప్తి లేదే! నా అసంతృప్తంతా అమ్మ ఆలోచించే పద్ధతి గురించే. అమ్మ అంటే ఎప్పుడూ 'నా పిల్లలు నా పిల్లలు' అని పొదువుకుని కూర్చోవడమే కాదు కదా!"

"అమ్మ అంటే పిల్లల అభివృద్ధి కోసం ఎంతో కొంత కృషి చేయాలి. దిశానిర్దేశం చేయాలి. వాళ్ళు సమస్యలలో వుంటే ఒక మంచి సలహా చెప్పాలి. అంతే కానీ వూరికే ప్రేమ కురిపిస్తే ఏం వుపయోగం!"

రమ్య మాటలకి నేను విస్తుపోయి చూశాను. అవును! రమ్యకి ఈ అసంతృప్తి అప్పట్లో కూడా వుండేది.

ఒకసారి అందరం కలిసి మాతో చదివే ఝాన్సీ పెళ్ళికి కర్నూల్ వెళ్ళాలనుకున్నాం. అందరిళ్ళల్లో ఒప్పుకున్నారు కానీ రమ్యా వాళ్ళ అమ్మ మాత్రం ఒక పట్టాన ఒప్పుకోలేదు. రాత్రిపూట వేరే వూర్లో వుండడం ఆవిడకి యిష్టం లేదు.

చివరికి అతికష్టం మీద ఆవిడకి నచ్చచెప్పి... ముందురోజు వెళ్ళాలనుకున్నవాళ్ళం... ఆ ప్రోగ్రాం మార్చుకుని... పొద్దున్నే బయల్దేరి వెళ్ళి రాత్రికి తిరిగి వచ్చేశాం. తనతోపాటు మా అందరి సరదా కూడా పాడు చేసినందుకు రమ్య చాలా నొచ్చుకుంది అపుడు.

"అసలు ఒక తల్లి తన పిల్లలకి యివ్వాల్సింది ఏమిటంటావే రమ్యా!" అన్నాను.

రమ్య నా ప్రశ్నకి ఆశ్చర్యంగా చూసింది. ఆ తర్వాత తనూ ఆలోచనలో పడింది. క్షణం తర్వాత "నువ్వు చెప్పు!" అంది.

"ఏమో! నేను ప్రేమ అనుకునేదాన్ని. నువు గైడెన్స్ అంటున్నావు."

"రెండూ యివ్వాలేమో!" అంది రమ్య. "రెండూ ఒకళ్ళే యివ్వలేరంటావా!" అంది సాలోచనగా.

"అదే అర్థం కావడం లేదు. బహుశా యివ్వలేరేమో! ఒకటి బాగా చేయగలిగిన వాళ్ళు రెండోది కొంచెం తక్కువగానే చేస్తారేమో!" అన్నాను.

ఆ తర్వాత యిద్దరం ఏమీ మాట్లాడలేదు. డిన్నర్ పూర్తి చేసి నిద్రకి ఉపక్రమించాం.

పొద్దున్నే ట్రైన్ దిగి బయటికి వస్తుంటే... "అయితే మన పిల్లలకి మనం ఏమివ్వాలంటావే! మా అమ్మలా ప్రేమా.. మీ అమ్మలా స్నేహమూ.. రెండూ యివ్వడానికి

ప్రయత్నించాలంటావా!" అంది రమ్య.

"ఏమో! రాత్రంతా నేను కూడా అదే ఆలోచించాను. వాళ్ళని విమర్శిస్తున్నాం కానీ... నిజానికి మన వుద్యోగాలతో.. హడావుడిలతో మనం ఒకటి కూడా పూర్తిగా యివ్వలేమేమో!" అన్నాను.

రమ్యా వాళ్ళ దగ్గర నుంచి వీడ్కోలు తీసుకుని, ఆటో ఎక్కాక శ్రీధర్ అడిగాడు. "ఏమిటి దీర్ఘంగా చర్చిస్తున్నారు నిన్నటి నుంచీ!" అని.

నేను నవ్వి మా సంభాషణ సారాంశం చెప్పాను.

శ్రీధర్ కూడా నవ్వాడు. "ప్రేమా, స్నేహమూ కాదు. 'మీకు మేం వున్నాం' అన్న నమ్మకాన్ని యివ్వాలి తల్లిదండ్రులు పిల్లలకి" అన్నాడు.

"మీ అమ్మగారు మీకు అదే యిచ్చారా!" అన్న మాట నా నోటిదాకా వచ్చి ఆగిపోయింది.

మా అత్తగారు అయిదేళ్ళ క్రితం చనిపోయారట. ఆవిడ గుర్తొచ్చినపుడల్లా శ్రీధర్ దిగులుగా అయిపోతాడు. మాపెళ్ళి నాటికే ఆవిడ లేదు. శ్రీధర్ అన్నా వదినలే చేశారు మాపెళ్ళి. అందుకేనేమో వదినగారంటే శ్రీధర్ కి చాలా అభిమానం. నాకు కూడా ఆమెని చూస్తే ఒకరకమైన గౌరవభావం కలుగుతుంది.

ఆటో ఆగగానే శ్రీధర్ వాళ్ళ అన్నయ్యా, వదినా, ఆరేళ్ళ ధాత్రీ, నాలుగేళ్ళ రాఘవ్... అందరూ బయటికి వచ్చి ఆహ్వానం పలికారు.

ఇంకా పూర్తిగా తెల్లవారనే లేదు. అప్పుడే స్నానం చేసి ఏవో స్తోత్రాలు చదువుకుంటూ ఫలహారం తయారు చేస్తోందావిడ. ధాత్రి కూడా స్నానం చేసొచ్చి వాళ్ళ అమ్మతో పాటు గొంతు కలిపింది.

"ధాత్రి కూడా చెప్పేస్తోందే!" అన్నాను నేను ఆశ్చర్యంగా. "ఇంత చిన్నప్పుడే ఇవన్నీ వచ్చేస్తాయా!"

"చిన్నవాళ్ళకే త్వరగా వస్తాయి" అంది ఆవిడ నవ్వుతూ. "రోజూ నేను పాడుకుంటూ వుంటాను కదా! విని, విని దానికీ వచ్చేశాయి."

ఒక గిన్నె తీసుకుని బయటికి వెళ్ళి పూజ కోసం పూలు కోయసాగింది ధాత్రి.

"ఇప్పట్నుంచే చక్కగా అన్నీ నేర్పిస్తున్నారన్నమాట" అన్నాను నేను.

"నేర్పాలమ్మా! దేవుడి పట్ల నమ్మకమూ, భక్తీ నేర్పగలిగితే చాలు... మిగతావన్నీ యిచ్చినట్లే" ప్లేటులో యిడ్లీలు పెట్టి నాచేతికిస్తూ చెప్పిందావిడ.

"భక్తా!... భక్తి కూడా.. నే.ర్చా.లా!" నా గొంతులో ఆశ్చర్యం ధ్వనించింది.

ఆవిడ నవ్వింది. "వాళ్ళంతట వాళ్ళకే... పుట్టుకతోనే వస్తే మంచిదే! కానీ మన ధర్మంగా మనం నేర్పాలి కదా!"

నేను వాకిట్లోకి వచ్చి ధాత్రిని చూస్తూ ఇడ్లీలు తినసాగాను.

"ఎందుకు ఇవాళ చాలా పూలు కోస్తున్నావు!" పక్కింటివాళ్ళ పిల్లాడు కాబోలు.... వాళ్ళ యింటి మెట్ల మీదనుంచి పలకరించాడు ధాత్రిని.

"ఇవాళ ఫ్రైడే కదా! అమ్మ ఎక్కువసేపు పూజ చేస్తుంది అమ్మవారికి" పూలు కోస్తూనే జవాబు చెప్పింది ధాత్రి.

"అమ్మవారంటే!" అన్నాడు వాడు.

"అమ్మవారంటే... అమ్మవారే!" అంది ధాత్రి ఎలా వివరించాలో అర్థం కానిదానిలా చూసి.

నేను వాళ్ళ సంభాషణకి నవ్వుతూ "అమ్మవారంటే పార్వతీదేవి" అని అందించాను.

"మరి అమ్మవారంటావే!" అన్నాడు వాడు.

"పార్వతీ దేవే మనందరికీ అమ్మ" ధాత్రి కూడా వివరిస్తున్నట్లుగా చెప్పింది.

"మరి మన అమ్మ!"

"మన అమ్మ కూడా అమ్మే. కానీ అసలు అమ్మ పార్వతీ దేవి. ఆ అమ్మకయితే అన్ని విషయాలు తెలుస్తాయి. మనకి ఏం కావాలన్నా యిస్తుంది. ఎప్పుడూ మనతోనే వుంటుంది" ఆ మాటలు చెప్పి ధాత్రి పూలు తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది.

నేను నిలుచున్న చోటే ఆలోచనలలో కూరుకుపోయాను. అది స్పష్టంగా చెప్పిన మాటల్లో ఏదో కొత్త పాఠం దాగుందనిపించింది. నా ఆలోచనలని చెదరగొడుతూ ఫోన్ మ్రోగింది.

శ్రీధర్ వదినగారి పుట్టింటి నుంచి. వాళ్ళ నాన్నగారికి సీరియస్‌గా వుందట!

మమ్మల్ని వదిలి వెళ్ళేందుకు వాళ్ళు సందేహిస్తుంటే... "ఏం పర్లేదు. పిల్లల్ని యిక్కడ వుంచేసి మీరు వెళ్ళి రండి" అని శ్రీధర్ వాళ్ళని బయల్దేరతీశాడు.

రోజంతా టెన్షన్‌గా గడిచింది. రాత్రి భోజనాలయ్యాక... శ్రీధర్ టి.వి. ముందు కూర్చుంటే, నేను పిల్లల ప్రక్కనే పడుకున్నాను. పిల్లలిద్దరూ నిద్ర పోయారు. కానీ నాకు నిద్ర పట్టలేదు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో వూహించలేం కదా! అనిపించింది.

అర్ధరాత్రి పన్నెండవుతూండగా ధాత్రి మంచినీళ్ళ కోసం లేచింది. మంచినీళ్ళిచ్చి మళ్ళీ వెంటనే పడుకోబెట్టబోయాను నేను.

నిద్రమత్తు పూర్తిగా వదిలితే వాళ్ళ అమ్మకోసం ఏడుస్తుందేమోనని నేను భయపడుతూంటే... "అమ్మ రేప్రొద్దున దాకా రాదా పిన్నీ!" అన్న ప్రశ్న బాణంలా వచ్చింది దాని నోటి నుంచి.

నేను గతుక్కుమన్నాను. అవునంటే దిగులు పడుతుందేమోనని నేను తటపటాయిస్తుంటే... "అలారం పెడతావా పిన్నీ! లేకపోతే మనకి పొద్దున్నే మెలకువ రాదేమో! స్కూల్ బస్ మిస్ అయిపోతుంది" అంది అది ఆరిందాలా.

నాకు నవ్వొచ్చింది. "అమ్మ రాకపోయినా స్కూల్‌కి వెళ్తావా!" అన్నాను.

"వెళ్ళాలి. రేపు ఎగ్జాం కూడా వుంది."

ఏమాత్రం దిగులు లేకుండా ధ్వనిస్తున్న దాని గొంతు విని అబ్బురపడుతూ.. "మరి నువ్వు స్కూల్‌కి వెళ్ళిపోతే తమ్ముడు అమ్మ కోసం ఏడుస్తాడేమో!" అన్నాను.

అరక్షణం నిశ్శబ్దం తర్వాత నిబ్బరంగా చెప్పింది ధాత్రి. "ఏడవడు పిన్నీ. మీరుంటారు కదా! అయినా వాడికి తెలుసు. అమ్మ వున్నా లేకపోయినా అమ్మవారు మాత్రం ఎప్పుడూ మనదగ్గరే వుంటారని వాడికి తెలుసు. అమ్మ వాడికి నేర్పించింది".

ఒక్క క్షణం నా శరీరం మొత్తం వణికినట్లయింది. ఒక అమ్మ తన పిల్లలకి ఏం యివ్వాలో ఒక్కసారిగా అర్థమయింది.

అవును. ఒక అమ్మ తన పిల్లల వుద్వేగాలకి సరిపడినంత ప్రేమని వాళ్ళకి యివ్వలేకపోవచ్చు. ఎదిగిన తర్వాత కూడా వాళ్ళని సంతృప్తిపరచగలిగిన సలహాలు చెప్పలేకపోవచ్చు. వాళ్ళతో ఎప్పటికీ వుండిపోగలనన్న నమ్మకాన్నీ కలిగించలేకపోవచ్చు. కానీ..... యివన్నీ చేయగల అమ్మ ఒకతె వుందని వాళ్ళకి చెప్పగలదు. ఆ అమ్మని వాళ్ళకి పరిచయం చేయగలదు. ఆ అమ్మపై వాళ్ళకి ప్రేమ ఏర్పడేలా ట్రెయిన్ చేయగలదు.

అప్పటికప్పుడు రమ్యకి ఫోన్ చేయాలన్న ఆలోచనని నిగ్రహించుకుంటూ ధాత్రి పక్కన నడుం వాల్చాను. దాని చేతిని నా చేతిలోకి తీసుకుని కృతజ్ఞతగా ఓ ముద్దు పెట్టాను. నా పొట్టపై ఒకసారి తడుముకుని, "శ్రీమాత్రేనమ:" అంటూ నా బిడ్డకి నేర్పాల్సిన పాఠాన్ని మననం చేసుకున్నాను.

*– ఆంధ్రప్రభ దినపత్రిక*

*2 అక్టోబర్ 2010*